# 21

# ముప్పు తెచ్చుకున్న చేపలు

ఒకప్పుడు సముద్రంలో చేపలన్నీ ఒకే విధంగా ఉండేవి.

పైగా... అవి నీటిలోనేకాక నేలమీద కూడా తిరగగలిగి, గాలిలో ఎగరగలుగుతుండేవి. వాటిని చూసి మనుషులు కూడా భయపడేవారు. ఈ చేపల దేవుడి పేరు... 'తంగరువా.' ఆయన్ని మనుషులు కూడా కొలిచేవారట.

ఒకసారి ఒకానొక ద్వీపంలో ఒక మనిషి భార్యతో పోట్లాడి పెళ్ళాన్ని, పిల్లల్నీ విడిచి వేరొక ద్వీపానికి పోయి తల దాచుకున్నాడు. అతని భార్య తంగరువా దేవుని ముందు తన గోడు వెళ్ళబుచ్చుకొంది.

దాంతో ఆయన మనస్సు కరిగి, తన చేపల సైన్యాన్ని ఆ మనిషిని వెతకడానికి పంపించాడు.

అవి- ఆ మనిషిని రక్షిస్తున్న ద్వీపవాసుల్ని ఓడించి అతన్ని తెచ్చి తమ దేవునికి అప్పజెప్పాయి. అవి సాధించిన విజయానికి సంతోషించి తంగరువా వాటిని ఏదైనా వరం కోరుకోమన్నాడు.

అవి- "మనుషులలోను, అనేక జంతువులలోను రకరకాలు రూపాల జాతులున్నాయి, మాలో కూడా అనేక జాతులు ఉండేటట్లు అనుగ్రహించండి!" అని వేడుకున్నాయి.

తంగరువా "బాగా ఆలోచించుకోండి. దీనివల్ల మంచికన్నా చెడు ఎక్కువ కలుగుతుంది" అని నచ్చచెప్పినా వినక పోయేసరికి వాటికి ఆ వరాన్ని అనుగ్రహించాడు.

అప్పటినుంచీ చేపలు కొన్ని ఎర్రగా, కొన్ని నీలంగా, కొన్ని చదరంగా, కొన్ని నక్షత్రం ఆకారంలో, కొన్ని ముక్కున రంపంతో ... ఇలా రకరకాలుగా ఏర్పడినాయి.

చేపలైతే ముచ్చటపడి రంగులూ, రూపాలూ, పరిమాణాలు మార్చుకున్నాయే కాని - అప్పటి నుంచీ వాటికి కష్టాలు మొదలయినాయి.



ఎప్పుడైతే వాటి పరిమాణాల్లో తేడాలు వచ్చాయో... అప్పటినుంచి పెద్ద చేపలు . చిన్న చేపల మీద అధికారం చెలాయించడం, చిన్న వాటిని మింగేయడం మొదలుపెట్టాయి. పెత్తనం కోసం అవి పోట్లాడు కోవడం మొదలుపెట్టాయి. అందమైన రంగులు, ఆకారాలుకల చేపలు అందంగా లేనివాటిని జూచి అసహ్యించుకోవడం మొదలుపెట్టాయి.

ఈ విధంగా... ఒకే జాతిగా వుండిన చేపలు వివిధమయిన వర్గాలుగా చీలిపోవడంతో వాటిలో అనైక్యత ఏర్పడి అవన్నీ బలహీనమైనవయ్యాయి. ఫలితంగా– అప్పటివరకు మనుషులమీద కూడా అధికారం చెలాయించిన చేపలు మనిషికి లొంగిపోయాయి.

చేపల రుచి మరిగిన మానవులు ఆహారం కోసం నిత్యమూ వాటిని వేటాడసాగారు. ఈ స్థితిలో తానేమీ చేయలేక తంగరువా దేవుడు ఎక్కడికో వెళ్లిపోయాడు.

ఈ కథ మనకి కూడా చక్కగా నప్పుతుంది కదూ..!

★★★